



సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 1-7-2025

సంపుటి: 21 సంచిక: 84
పేజీలు: 8 వెల: రూ.1


### సచివాలయ ఏఎన్ఎంల

# కౌన్సిలింగ్ పెంటపెంట!

❖అర్బన్‌లో 5 స్థానాలు బ్లాక్ చేయడంతో రభస

❖మంగళవారం వేకువజాము నుంచి దిద్దుబాటు చర్యలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో అన్ని సచివాలయాల పరిధిలో ఉన్న గ్రేడ్3 ఏఎన్ఎంలకు జరుగుతున్న బదిలీలు పెంటపెంటగా మారాయి. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సచివాలయాల్లో హెల్త్ సర్వీస్ ప్రొవైడర్లుగా ఉద్యోగాలు పొందిన వీరు వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో గ్రేడ్-3 ఏఎన్ఎంలుగా పరిగణించబడ్డారు. ఇప్పుడు సాధారణ బదిలీల్లో భాగంగా వీరికి కూడా బదిలీ చేయాలని, ఒక్కో సచివాలయంలో వీరు చేరి ఐదేళ్లు దాటిపోయింది కాబట్టి, వేరే చోటకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో రెండు రోజులుగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో వీరికి కౌన్సిలింగ్ జరుగుతోంది. దీన్ని జూమ్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. మొత్తం 605 గ్రేడ్-3 ఏఎన్ఎంలకు వారి డేటాఫ్ బర్త్, సర్వీస్‌లో చేరిన తేదీ ప్రకారం రోస్టర్‌ను నిర్ణయించారు. ఆ మేరకు 605 ఖాళీల్లో స్థానాలు ఎంచుకోవాలని జూమ్ ద్వారా కోరారు. అయితే, అర్బన్‌లో ఐదు కేంద్రాల్లో పోస్టులు ముందుగానే ఖాళీ లేవని చూపించడంతో రోస్టర్‌లో ముందువరుసలో ఉన్నవారు గత్యంతరం లేక వేరే ప్రాంతాలకు బదిలీ ఆప్షన్ ఎంచుకున్నారు. ఇందులో మెడికల్ గ్రౌండ్స్, స్పౌజ్ కోటా కింద అర్బన్‌కు రావాలని చూసినవారికి సైతం అవకాశం దక్కలేదు. ప్రభుత్వం తాజాగా చేసిన జీవో మేరకు ఇప్పటి వరకు పని చేసిన సచివాలయంలో కాకుండా పక్క సచివాలయానికి బదిలీ



పై వెళ్లే అవకాశం దక్కింది. ఆమేరకు అర్బన్‌లో పని చేస్తున్నవారికి అర్బన్‌లోనే మరో సచివాలయానికి, రూరల్‌లో పని చేస్తున్నవారికి రూరల్‌లోనే మరో సచివాలయానికి బదిలీ చేయాలని నిర్ణయించారు. కానీ అర్బన్‌లో కొన్ని స్థానాలు బ్లాక్ చేయడం వల్ల వాటిని సీనియారిటీలో ముందున్నవారు పొందలేకపోయారు. కానీ మంగళవారం వేకువజామున మూడు గంటల ప్రాంతంలో ఇద్దరు ఏఎన్ఎంల మధ్య ఆదివారంపేట

- మిగతా చివరి పేజీలో

### విద్యాసంస్థలను కలిపేయ్...

# విద్యార్థులను కర్వేపాకులా తీసిపారెయ్!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరంలో ఆదివారంపేట సమీపంలో ఉన్న గ్లోబల్ జూనియర్ కళాశాలలో తనిఖీలు జరిపిన అధికారులు రూ. 6లక్షల జరిమానా విధిస్తే, ఆ మొత్తాన్ని కళాశాల యాజమాన్యం ఇప్పటివరకు చెల్లించలేదు. ఎందుకు చెల్లించలేదని అధికారులూ అడగలేదు. ఇదే అదనుగా అనుమతులు లేకపోయినా 20 రోజుల క్రితం ప్రారంభమైన కొత్త విద్యా సంవత్సరానికి కూడా గ్లోబల్ యాజమాన్యం యథేచ్ఛగా అడ్మిషన్లు నిర్వహించి, క్లాసులు కొనసాగిస్తోంది. ఇదేంటయ్యా.. అని ప్రశ్నిస్తే, అనుమతి కోసం ఇంటర్ బోర్డుకు దరఖాస్తు చేస్తున్నట్లు నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు.

నగరంలోని చక్రధర్ జూనియర్ కళాశాలను విలీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న గ్లోబల్ యాజమాన్యం.. తమ సంస్థలో చదివి పాసైన విద్యార్థులకు చక్రధర్ కళాశాల పేరుతో సర్టిఫికెట్లు ఇస్తోంది. కానీ చక్రధర్ కళా



☆రూ. 6 లక్షల అపరాధ రుసుము చెల్లించని 'గ్లోబల్'

☆నాలుగు విద్యాసంస్థలను కలిపేసుకొని చేతులెత్తేసిన సంస్థ

☆'చక్రధర్' విద్యార్థుల ఫిర్యాదుతో కలెక్టర్ దృష్టికి

☆'ఇంటర్నెషనల్' పేరుతో జంతర్‌మంతర్





శాలలో చదివిన వారికి మాత్రం సర్టిఫికెట్లు ఇవ్వకుండా అవస్థల పాల్జేస్తోంది. చక్రధర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు చక్రధర్ మృతి చెందగా.. ఆయన కుమార్తె ద్వారా ఆ విద్యాసంస్థలన్నింటినీ మధ్యవర్తుల ఒప్పందం ఆధారంగా గ్లోబల్ యాజమాన్యం విలీనం (స్వాధీనం) చేసుకుంది. అయితే విలీన ప్రక్రియ ఇప్పటికీ పూర్తికాలేదు. ఒప్పందం ప్రకారం జరపాల్సిన చెల్లింపులను గ్లోబల్ యాజమాన్యం పూర్తి చేయనందున విలీన ప్రక్రియ అసంపూర్తిగా మిగిలిపోయినట్లు సమాచారం. అయినా గ్లోబల్ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థులకు చక్రధర్ విద్యాసంస్థ పేరుతోనే సర్టిఫికెట్లు ఇస్తున్నారు. కానీ 2024-25 విద్యాసంవత్సరంలో చక్రధర్ జూనియర్ కళాశాలలో చదివిన వారికి మాత్రం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. గ్లోబల్ కళాశాలలో చక్రధర్ కళాశాల విలీనమైందంటూ కొన్నాళ్లు కలిసి కొనసాగించినబంధం నచ్చక పలువురు చక్రధర్ కళాశాల విద్యార్థులు వేరే కళాశాలల్లో చేరారు. కానీ ఇంటర్‌లో చేరినప్పుడు చక్రధర్ యాజమాన్యానికి ఇచ్చిన పదో తరగతి మార్క్ షీట్, టీసీ, స్టడీ సర్టిఫికెట్ల కోసం వారంతా గ్లోబల్ యాజమాన్యం చుట్టూ తిరుగుతున్నారు. చక్రధర్ విద్యాసంస్థ కొనుగోలుకు ఒప్పందం కుదిరిన సమయంలోనే రాసుకున్న పత్రాల మేరకు

- మిగతా చివరి పేజీలో







• ఎడిటోరియల్

# స్వరూపానంద పోయె.. రాందేవ్ బాబా వచ్చె!

రాష్ట్రంలో వైకాపా స్థానంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైంది. అధికార మార్పిడికి అనుగుణంగా ఉన్నతాధికార వ్యవస్థ, సలహాదారుల కూటమిలోనూ భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. నాటి జగన్ ప్రభుత్వంలో సలహాదారుల రాజ్యం నడుస్తోందని, పనీపాటా లేనివారిని, ఆయా రంగాలతో సంబంధం లేనివారిని సలహాదారులుగా నియమిస్తూ ప్రభుత్వాన్ని పునరావాస కేంద్రంగా మార్చేశారని తెలుగుదేశం, జనసేన పార్టీలు దుమ్మెత్తిపోశాయి. కానీ ప్రస్తుతం అవే పార్టీల భాగస్వామ్యంతో నడుస్తున్న సర్కారులోనూ అదే జరుగుతోంది. పలు శాఖలకు, రంగాలకు భారీ జీతభత్యాలతో సలహాదారులను నియమిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా జరిపిన ఒక నియామకం మాత్రం తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. పర్యాటక శాఖ సలహాదారుగా వివాదాస్పద యోగా గురువు బాబా రాందేవ్‌ను నియమించారు. ఇటీవల జరిగిన కంటెయినర్ టూరిజం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎంతో చంద్రబాబుతో కలిసి రాందేవ్ కూడా పాల్గొన్నారు. కూటమి సర్కారు నియమించిన మిగతా సలహాదారుల స్థాయి మాటెలా ఉన్నా.. శాస్త్ర సాంకేతిక సలహాదారుగా ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డిని నియమించడం మాత్రం ప్రశంసలు అందుకుంది. కానీ అంతలోనే బాబా రాందేవ్‌ను సలహాదారుగా నియమించడం ఆ గుడ్‌విల్‌ను వాష్ అవుట్ చేసేసింది. వైకాపా హయాంలో ఉన్న రాజగురువు పోయి.. కొత్త రాజగురువు వచ్చారన్న వ్యంగ్యాస్త్రాలు కూడా వినిపిస్తున్నాయి. జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు విశాఖ శారదాపీఠానికి చెందిన స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి రాజగురువుగా ఉండేవారు. అప్పట్లో శారదా పీఠం రాజకీయ కేంద్రంగా మారిందన్న విమర్శలు చెలరేగాయి. తిరుమలలో కూడా ఆ స్వామికి ఎనలేని ప్రాధాన్యం దక్కేది. తిరుమలలో కొంత భూమి కేటాయించడంతో పాటు కొన్ని భవనాలను కూడా ఆయన కోసం రిజర్వ్ చేశారు. వేద విశ్వవిద్యాలయం ఏర్పాటుకు భీమిలిలో శారదా పీఠానికి భూములు కూడా కేటాయించారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. తిరుమలలో కూడా ప్రాధాన్యత తగ్గింది. కట్ చేస్తే.. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు బాబా రాందేవ్‌ను ప్రభుత్వ సలహాదారుగా ప్రకటించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆయన పర్యాటక రంగాన్ని తన సలహాలతో ఉద్ధరించడానికి కృషి చేస్తారని ప్రభుత్వం ప్రకటించింది. రాందేవ్ యోగా గురువు మాత్రమే. అంతకు మించి పర్యాటక రంగంతో ఏమాత్రం సంబంధం లేదు. ఆ రంగంలో ఆయన నిష్ణాతుడు కూడా కాదు. మరి ఏ ప్రాతిపదికన రాందేవ్‌ను పర్యాటక రంగ సలహాదారుగా నియమించారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు స్వరూపానందేంద్ర మాదిరిగానే రాందేవ్‌ది కూడా వివాదాస్పద చరిత్రే. విశాఖ నగర శివారులోని చినముషిడివాడలో స్వరూపానందేంద్ర నడుపుతున్న శారదా పీఠం భూముల్లో కొన్ని ఆక్రమించినవేనన్న ఆరోపణలు చాలా ఏళ్ల నుంచీ ఉన్నాయి. అవి చాలవన్నట్లు ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శారదా పీఠానికి భారీగా భూములను నామమాత్రపు ధరకు కేటాయించింది. ఇక జగన్ సర్కారు భీమిలి సమీపంలో అత్యంత ఖరీదైన ఎనిమిది ఎకరాలు కేటాయించింది. దీనిపై అప్పట్లో టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పుడు స్వరూపానందేంద్ర స్థానాన్ని రాందేవ్ భర్తీ చేస్తున్నారు. పతంజలి ఆయుర్వేద మందుల సంస్థ వ్యవస్థాపకుడిగా ఉన్న రాందేవ్‌కు కూటమి సర్కారు విజయనగరం జిల్లా కొత్తవలస సమీపంలో ఆయుర్వేద కంపెనీ ఏర్పాటుకు 120 ఎకరాలు కేటాయించినట్లు తెలుస్తోంది. అలాగే శారదా పీఠం నుంచి వెనక్కి తీసుకున్న ఎనిమిది ఎకరాలను కూడా బాబా రాందేవ్‌కు కేటాయిస్తారని ప్రభుత్వ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గతంలో మహిళలు, మైనారిటీలపైనా, ఆధునిక వైద్యం గురించి రాందేవ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమై విమర్శలకు దారితీశాయి. అలాగే ఆయనకు చెందిన పతంజలి ఆయుర్వేద ఔషధ సంస్థ తప్పుదోవ పట్టించే వాణిజ్య ప్రకటనలు ఇవ్వడంపై కేరళ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు మందలింపులు ఎదుర్కొంది. రాందేవ్‌పై అరెస్టు వారెంట్ కూడా జారీ అయ్యింది. ఇలాంటి నేపథ్యం ఉన్న ఆయన్ను సలహాదారుగా నియమించడానికి కారణం చంద్రబాబుతో తొలి నుంచి ఆయనకు సాన్నిహిత్యం ఉండటంతో పాటు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ పెద్దలతోనూ సన్నిహిత సంబంధాలు ఉండటమే. హిందూత్వ భావజాలం ఉన్న ఆయన నియామకం వివాదాస్పదమవుతోంది.

# పేదల పాలిట పెన్నిధి చంద్రబాబు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పేదల పాలిట ఆపద్బాంధవునిలా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలుస్తున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు కొనియాడారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాలు మేరకు మంగళవారం పట్టణ పరిధి రెండో డివిజన్ ఇన్‌చార్జి అక్కేన రాజారావు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా పింఛన్లు ఇంటింటికి వెళ్ళి పంపిణీ చేశారు. పింఛన్ల లబ్దిదారుల కళ్లల్లో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిచంద్రబాబు పేదల పాలిట పెన్నిధిగా కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో ఒక పక్క అభివృద్ధి, మరోపక్క సంక్షేమం యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర వైపు నడిపిస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్‌లోని ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఒకటో తేదీనే ఠంచనుగా పంపిణీ, దీపం-2 పథకం కింద ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్ల సరఫరా, తల్లికి వందనం ద్వారా, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు తల్లుల ఖాతాలో జమ, అదేవిధంగా అన్నదాత సుఖీభవ కింద రైతన్నకు ఆర్థిక సహాయం, ఆగస్టు15 నుండి మహిళల ఉచితబస్సు ప్రయాణం, ఇంకా ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ యువతకు, ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి కల్పించబోతున్నారన్నారు. కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాధ్యం అని సర్వత్రా నమ్ముతున్నారన్నారు. కార్యక్రమంలో రెడ్డి శివ, జగన్, నగేష్, సచివాలయం సిబ్బంది స్వరూప్, రాధ, సరిత తదితరులు పాల్గొన్నారు.



# సేవలు సంతృప్తినిచ్చాయి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



హర్షవల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షునిగా ఏడాదిపాటు తాను చేసిన సేవలు ఎంతో సంతృప్తినిచ్చాయని క్లబ్ అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథనాయుడు పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది జూలై ఒకటో తేదీన హర్షవల్లి లైన్స్‌క్లబ్ కు అధ్యక్షునిగా పదవీ బాధ్యతలను చేపట్టానన్నారు. తన పదవీకాలం ఈ ఏడాది జూన్ నెలాఖరుకి ముగిసిందన్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం పట్టణంలోని బడుగు బలహీన వర్గాల సేవలోను అలాగే రోగులకు వ్యాధి నిర్ధారణ, వైద్య సేవలందించడం కోసం శిబిరాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, శాంతి సందేశం, ఆహార వితరణ, పచ్చదనం పరిశుభ్రం, విద్యార్థులలో ఆరోగ్య అవగాహన చైతన్యం, ప్రభుత్వ కార్యక్రమాలలో శ్రీకాకుళం జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలతో కలసి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలలో తమవంతు సాయం అందించడం ఎంతో సంతృప్తిని కలిగించిందని లయన్ వావిలపల్లి జగన్నాథనాయుడు తెలియజేశారు. సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రచార కార్యక్రమాలకు లయన్స్ విస్తృతసేవలకు అండదండగా తనకు నిలిచిన వ్యవస్థాపక అధ్యక్షుడు హారిక ప్రసాద్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ నుంచి ఎటువంటి నిధులు తమ లయన్స్ క్లబ్‌కు రాకపోయినప్పటికీ హారికా ప్రసాద్, సభ్యుల వితరణతో లక్షలాది రూపాయలు వెచ్చించి అనేక సేవా కార్యక్రమాల నిర్వహణతో ఏడాదిలోనే శ్రీకాకుళం పట్టణ ప్రజల అభిమానాన్ని పొందడానికి ప్రధాన కారణం హర్షవల్లి లైన్స్‌క్లబ్ కార్యవర్గం, మెంబర్లు, అలాగే జూమ్ చైర్మన్, జోన్ చైర్మన్, అరసవల్లి లైన్స్‌క్లబ్ మెంబర్ కరణం శోభరాణి అండదండలు సేవారంగంలో తమకు మరింత ప్రోత్సాహాన్ని అందించారన్నారు. ఈ సేవలకు నచ్చి, మెచ్చి లయన్స్ ఇంటర్నేషనల్ 316ఎ గవర్నర్ 7అవార్డులను ఒకేసారి అందజేసి ఆయన యొక్క అభినందనలు ఆ రూపంలో హర్షవల్లి లైన్స్ క్లబ్‌కి అందజేయడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. అనంతరం నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ మేడిశెట్టి సత్యస్వరూప్‌ను ఎన్నుకున్నారు.

### తన చేతులతో పింఛన్ ఇవ్వడం


# ఎంతో ఆనందంగా ఉంది

(సత్యంన్యూస్, టెక్కలి)

నియోజకవర్గ పరిధిలో గల సంతబొమ్మాళి మండలం ఉమిలాడ గ్రామంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం ఉదయాన్నే పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు మంత్రి స్వయంగా వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ ఫథకాలు సంతృప్తినిస్తున్నాయని, ప్రతినెల ఉదయాన్నే ఇంటికి తెచ్చి ఇవ్వడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ పేదల పింఛన్ల పంపిణీకి ఏడాదికి రూ.33వేల కోట్లు కూటమి ప్రభుత్వం అందచేస్తుందన్నారు. నియోజకవర్గంలో పేదల సేవల పేరిట నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి నెలా 63 లక్షల మందికి 28 రకాల పింఛన్లు ఇస్తున్నామన్నారు. పొరుగు రాష్ట్రాలలో ఇంత మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదని, మన రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ దేశంలోనే అతి పెద్ద సంక్షేమ కార్యక్రమంగా నిలుస్తోందని చెప్పారు. పేదలకు భరోసా ఇచ్చే కార్యక్రమంలో స్వయంగా పాల్గొని పింఛను ఇవ్వడం తనకు ఎంతో సంతృప్తిని ఇస్తోందని, అందుకే ప్రతి నెలా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నానని తెలిపారు. ప్రజల స్థితిగతులు, సాధకబాధలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరి వరప్రసాద్, ఆర్డీవో కృష్ణమూర్తి, అధికారులు, తెలుగుదేశం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**జోరువానలో మంత్రి అచ్చెన్న పర్యటన..**

సంతబొమ్మాళి మండలం ఉమిలాడ, జగన్నాథపురం గ్రామాల్లో జోరువానలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పర్యటన సాగించారు. ఎన్టీఆర్ భరోసా నూతన పింఛన్ పంపిణీ కార్యక్రమం, సీసీ రోడ్లు, బీచ్ రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే ఈ సందర్భంలో జోరుగా వర్షం పడిన రాష్ట్రమంత్రి తన పర్యటన కొనసాగించడం ఆయన పనితీరుకు నిదర్శనీయమని అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సినిమాల్లో నటించినా.. కథలు రాసినా.. దర్శకత్వం చేసినా తన రంగంలో విజయ బావుటా ఎగరేసి న ప్రతి మనిషి సక్సెస్ వెనుక కూడా ఓ స్టోరీ ఉంటుంది. మొదటి సినిమా డీజే టిల్లు తోనే బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన ఇంజనీరింగ్ చదివి న ఓ యువకుడి సక్సెస్ స్టోరీ ఇప్పుడు తెలుసుకుందాం! డీజే టిల్లు సూపర్ హిట్ అవడానికి కూడా ఓ కారణం ఉంది. డీజే టిల్లు సినిమా రాత్రికి రాత్రి తీసిన సినిమా కాదు. ఈ సినిమా కోసం దర్శకుడు విమల్ కృష్ణ నిద్రాహారాలు మాని తపస్సులా పనిచేసాడు. కోవిడ్ టైం లో అయితే ఏకంగా తన మకాంను హీరో సిద్దు జొన్నలగడ్డ ఇంటికి మార్చి స్క్రిప్ట్ వర్క్ చేసాడు. ఈ విజయం వెనుక పదేళ్ళపాటు ఆ కుర్రాడు పడిన కస్టాలు.. కఠోర శ్రమ ఉంది. ఏ ఫిలిం బ్యాక్ గ్రౌండ్ లేకుండా వైజాగ్ బీచ్ లో షార్ట్ ఫిలిమ్స్ చేసుకునే ఓ కుర్రాడు పదేళ్లలో బ్లాక్ బస్టర్ హిట్ సినిమాకి దర్శకుడు అయి వేదికల మీద అవార్డులు తీసుకోవడం వెనుక అతడి కష్టం ఉంది



# పడి పడి లేచి.. ఉవ్వెత్తున ఎగసిన కెరటం!

ఈ ప్రయాణంలో ఎన్నో నిరసనలు.. హేళనలు.. అవమానాలు ఎదుర్కొన్నాడు. అయినా అతడు నిరాశపడి తన లక్ష్యాన్ని వదులుకోలేదు. గోడకు కొట్టిన బంతిలా తిరిగి పరుగులు పెట్టాడు. విమల్ కృష్ణ సక్సెస్‌స్టోరీ చెప్పుకునేముందు కొంత ఫ్లాష్‌బ్యాక్ స్టోరీ కూడా చెప్పుకోవాలి

విమల్ కృష్ణ ది వైజాగ్. సినిమాలంటే ప్రాణం. ఎప్పటికైనా సినిమాల్లో పెద్ద హీరో అయిపోవాలని కలలు కనేవాడు. ఇక్కడ విమల్ కృష్ణ తండ్రిది కూడా చిన్న ఫ్లాష్‌బ్యాక్ చెప్పుకోవాలి. విమల్ కృష్ణ తండ్రి శ్రావణ్‌కుమార్‌కు కూడా సినిమాలంటే ప్యాషన్. ఆ మోజుతోనే చిన్నప్పుడు ఏడవ తరగతి చదువుతున్న రోజుల్లోనే తెలంగాణాలోని మానుకోట ఇంటినుంచి పారిపోయి మద్రాసు రైలెక్కి సూపర్ స్టార్ కృష్ణ ఇంటికి చేరుకొని మూడునెలల పాటు కృష్ణ, విజయ నిర్మల దంపతుల దగ్గర పెరిగాడు. తర్వాత అతని తల్లితండ్రులు కొడుకును వెతుక్కుంటూ తెలిసినవారి ద్వారా మద్రాస్ వెళ్లి కృష్ణ గారి ఇంటి నుంచి తమ అబ్బాయిని వెనక్కి తెచ్చుకున్నారు.

ఇప్పుడు రీలు మళ్ళీ విమల్ కృష్ణ దగ్గరికి తీసుకొస్తే.. వైజాగ్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న రోజుల్లో విమల్‌కృష్ణ సాయంత్రం వేళ మిత్రబృందంతో రామకృష్ణా బీచ్‌కు వెళ్లి షార్ట్‌ఫిలిమ్స్ చేసేవాడు. వీళ్ళ దగ్గర పెద్ద పరికరాలు కూడా ఏమీ లేవు. చేతిలో ఉన్న మొబైల్ తోనే షూట్ చేసుకునేవారు.

వీళ్ళలో విమల్‌కృష్ణ మొబైల్ కెమెరా ముందు హీరో వేషాలు కడితే ఒక ఫ్రెండు డైలాగులు రాసేవాడు. ఇంకోడు డైరెక్షన్ చేసేవాడు. అవన్నీ ఫోనులో ప్రివ్యూ చూసుకుని మురిసిపోయేవారు. అందరి లక్ష్యం ఒకటే సినిమాల్లో సెలెబ్రిటీ అవ్వాలి.

వీళ్ళలో వీళ్ళే ఒకళ్ళు డైరెక్షన్ డిపార్ట్మెంట్ వైపు.. మరొకడు రైటర్ గానూ.. విమల్ కృష్ణ హీరోగానూ సెటిల్ అయిపోవాలని 2012లో పెట్టేబేడా సర్దుకుని వైజాగ్ నుంచి హైద్రాబాదుకు బయలుదేరారు. విమల్ కృష్ణ తన లక్ష్యాన్ని ముందుగా తల్లితండ్రులకు చెప్తూ 'నా అదృష్టాన్ని సినిమాల్లో పరీక్షించుకునేందుకు ఒక పదేళ్లు టైం పెట్టుకుంటున్నా.. ఒకవేళ నేను అక్కడ సక్సెస్ కాకపోతే బుద్ధిగా ఉద్యోగం చేసుకుంటూ సెటిల్ అయిపోతా..' అన్నాడు. తల్లితండ్రులు అతడ్ని దీవించి పంపారు. కానీ ఇరుగుపొరుగు నుంచి ఊహించని హేళనలు మొదలయ్యాయి. 'ఇంజనీరింగ్ చదువుకుని సుబ్బరంగా ఏ ఉద్యోగమో చేసుకోకుండా సినిమాలంటూ ఎగేసుకుని బయలుదేరటం అవసరమా? పైగా ఏ సినిమా బ్యాక్‌గ్రౌండ్ కూడా లేదు.. మహామహా నటుల వారసులే సినిమాల్లో నిలదొక్కుకోలేక వ్యాపారాలు చేసుకుంటున్నారు' అని కాకుల్లా పొడిచారు. ఒక్కడు కూడా అతడి ప్రయత్నాన్ని మనఃస్ఫూర్తిగా అభినందించకపోగా వెటకారాలు చేసారు. కానీ ఈ సూటిపోటి మాటలేవీ ఆ కుర్రాడి లక్ష్యాన్ని ఆపలేకపోయాయి.

ఎవరి హేళనలు పట్టించుకోకుండా హైదరాబాద్ వచ్చేసాడు. సినిమాల్లో హీరో అవ్వాలి సరే ఎవర్ని అప్రోచ్ అవ్వాలి ?అసలు ప్రొజర్ ఏంటి ? ఏమీ తెలీదు.

సరిగ్గా అప్పుడే ఎవరో క్రౌడ్ ఫండింగ్ ద్వారా సినిమా తీస్తున్నాం అని ఫేస్ బుక్‌లో పెట్టిన పోస్ట్ చూసి ఆడిషన్స్‌కు వెళ్ళాడు. విమల్ కృష్ణ పెర్ఫార్మన్స్ చూసి బాగా చేసావ్.. మేము కాల్ చేసినప్పుడు రమ్మని చెప్పి పంపేశారు. కానీ వాళ్ళ దగ్గరినుంచి కాల్ రాలేదు. వాళ్ళే కాదు సుమారు ముప్పై నలభై ఆడిషన్స్‌కు వెళ్లినా అందరూ బాగా చేసావ్.. మళ్ళీ కాల్ చేస్తాం.. అని పంపేశారు. కానీ ఒక్కడు కూడా కాల్ చేయలేదు. దాంతో మొదటిసారిగా విమల్‌కృష్ణలో నిరాశ వచ్చింది. సినిమాల్లో తనకు అవకాశాలు రావడం కష్టం అయిపోతుందని గ్రహించాడు. అయినా సరే ఒక్క చాన్సు అంటూ స్టూడియోల చుట్టూ తిరిగాడు. ఆఖరికి స్నేహితుల ద్వారా జెస్సీ అనే సినిమాలో నటించే అవకాశం వచ్చింది. దాంతో పాటు ఇంకో రెండు సినిమాల్లో అవకాశం వచ్చింది. కానీ దురదృష్టవశాత్తు ఆ సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. మళ్ళీ విమల్‌కృష్ణ అంతర్మథనంలో పడ్డాడు. తాను టార్గెట్ పెట్టుకున్న పదేళ్లలో ఐదేళ్లు గడిచిపోయాయి. ఇంకా ఐదేళ్లు ఉంది.. ఇక సినిమా అవకాశాల కోసం ప్రయత్నాలు చేయడం ఆపేసి ఇంటికెళ్ళిపోయి బుద్ధిగా ఉద్యోగం చేసుకుందామా? అనుకున్నాడు. ఇదే విషయం క్షణం సినిమాకు దర్శకత్వం వహించిన తన స్నేహితుడికి చెప్తే 'విమల్ సినిమా అనేది నీ లక్ష్యం.. ఒక క్రాఫ్ట్‌లో అవకాశాలు రానంత మాత్రాన నిరుత్సాహంతో వెనక్కి వెళ్ళిపోతావా ? సినిమాల మీద నీకున్న ప్యాషన్ ఏదో ఒకరోజు నిన్ను గొప్పవాడిని చేస్తాయి.. దర్శకుడిగా నువ్వెందుకు ప్రయత్నం చేయకూడదు ? అని ధైర్యం చెప్పి సురేష్ ప్రొడక్షన్స్ సురేష్ బాబు, రానాల దగ్గరికి తీసుకెళ్లి పరిచయం చేసాడు. సురేష్‌బాబుతో పరిచయం విమల్‌కృష్ణ జీవితాన్ని మలుపు తిప్పింది.

సినిమాల గురించి సురేష్‌బాబు చెప్తూ, 'నువ్వు సినిమాకి కథ రాసినా, దర్శకత్వం చేసినా విమల్‌కృష్ణ కనిపించకూడదు.. నీలో థియేటర్లో ప్రేక్షకుడి స్థానం కన్పించాలి.. అప్పుడే ఏ సినిమాకైనా, నిర్మాతకైనా న్యాయం జరుగుతుంది' అన్నారు. ఆ మాటలు విమల్ కృష్ణకు అద్భుతమైన టానిక్‌లా పనిచేసాయి. అంతే క్షణం ఆలస్యం చేయకుండా ఇంటికెళ్లి డీజే టిల్లు స్టోరీ రాయడం మొదలుపెట్టాడు. కథ అవుట్‌లైన్స్‌ని హీరో సిద్దు జొన్నలగడ్డకు వినిపించాడు. కథ నచ్చటంతో సిద్దు కూడా వెంటనే ఓకే చేప్పేసాడు.

ఈలోగా 2018లో కోవిడ్ రూపంలో ఇంకో అవాంతరం వచ్చింది. లాక్‌డౌన్‌లు నడుస్తున్నాయి. దాంతో విమల్ కృష్ణ తన మకాం సిద్దు ఇంటికి మార్చాడు. అక్కడే పగలూ రాత్రి స్టోరీ డిస్కషన్స్ జరిగి డీజే టిల్లు రూపుదిద్దుకున్నాడు. సరే సినిమాకు కథ రెడీ అయ్యింది.. హీరో దొరికాడు.. కానీ ప్రొడ్యూసర్ ఏడీ ?

సరిగ్గా ఇదే సమయంలో సితార ఎంటర్టైన్మెంట్ నుంచి పిలుపు వచ్చింది.. కథను ప్రొడ్యూసర్ నాగవంశీకి చెప్పడం ఆయన ఓకే చేయడం చకచకా జరిగిపోయాయి.

అదే సమయంలో వేరే కథా చర్చల్లో ఉన్న త్రివిక్రమ్ శ్రీనివాస్ డీజే టిల్లు కథ విని అవసరమైన కొన్ని మార్పులూ చేర్పులూ సూచించడంతో ఫైనల్ స్క్రిప్ట్ రెడీ అయి శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకుని 2022లో డీజే టిల్లు వెండితెర మీదకు వచ్చి బ్లాక్‌బస్టర్ హిట్ అయ్యింది. సరిగ్గా పదేళ్లలో అనుకున్న గోల్ కొట్టాడు విమల్ కృష్ణ. డీజే టిల్లు సక్సెస్‌తో గతంలో హేళన చేసినవారే విమల్ కృష్ణను వెతుక్కుంటూ వచ్చి మరీ అభినందనలు తెలిపారు.

అయినా విమల్‌కృష్ణ ఒకటే చెప్తాడు.. 'నేను సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నప్పుడు హేళన చేసినవారి మాటలను పట్టించుకోను.. కానీ కష్టకాలంలో నాకు అండగా నిలిచిన వారిని మాత్రం జీవితాంతం గుర్తుపెట్టుకుంటాను.. నా ఈ విజయం వెనుక అలా భుజం తట్టి ప్రోత్సహించిన వారి ప్రేమ ఉంది.. డీజే టిల్లు విజయాన్ని మనసుకు మాత్రమే తీసుకున్నా.. ఆ విజయంతో వచ్చే గర్వాన్ని మాత్రం నా ఛాయలకు కూడా రానివ్వలేదు.. రానివ్వను కూడా' అన్నాడు.

**- పరేష్ తుర్లపాటి**

## కపిల్ మాటలు స్ఫూర్తినిచ్చాయి

ఒకసారి ఏదో క్రికెట్ టోర్నమెంట్ అవార్డ్స్ ఫంక్షన్ కోసం కపిల్ దేవ్ వైజాగ్ వచ్చాడు. పిల్లలందరూ కపిల్ దేవ్ ఆటోగ్రాఫ్ కోసం ఎగబడ్డారుకానీ విమల్‌కృష్ణ మాత్రం ఆ క్యూలో దూరకుండా చూస్తూ నిలబడ్డాడు. అప్పుడు కపిల్ దేవ్ ఆ కుర్రాడి దగ్గరకు వచ్చి నవ్వుతూ భుజం మీద చెయ్యేసి 'అందరూ ఆటోగ్రాఫులు పెట్టించుకోవాలని ఎగబడ్డారు.. కానీ మనం కూడా అలా ఆటోగ్రాఫ్ ఇచ్చే స్థాయికి ఎదగాలని అనుకోరు.. కొంతమంది మాత్రమే అనుకుంటారు .. ప్రయత్నించు .. ఆల్ ది బెస్ట్ ' అని చెప్పి వెళ్లిపోయారట. ఆ మాటల ప్రభావం విమల్ కృష్ణలో బలంగా నాటుకు పోయింది.

**కొసమెరుపు:** డీజే టిల్లు సినిమా చూడటానికి దర్శకుడు విమల్ కృష్ణ థియేటర్‌కు వెళ్ళినప్పుడు ఓ కుర్రాడు పరిగెట్టుకుంటూ వచ్చి 'అంకుల్ ఆటోగ్రాఫ్ ప్లీజ్' అని అడిగాడుఅప్పుడు విమల్ కృష్ణకు కపిల్ దేవ్ మాటలు గుర్తుకొచ్చాయి .. విజయదరహాసంతో ఆటోగ్రాఫ్ ఇచ్చాడు !



నగర కార్పొరేషన్ పరిధి 16వ డివిజన్ పరిధి గొంటివీధి, గాజుల వీధి, సాయిబుల తోటలో వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు టీడీపీ ఇన్‌చార్జ్ ఎస్వీ రమణమాదిగ పింఛన్లను పంపిణీ చేశారు. కార్య క్రమంలో సచివాలయం సెక్రటరీ కిషోర్, అమ్ములు, ఉమా, వెంకట రమణ, తారక, భేగమ్, రామారావు, డివిజన్ టీడీపీ సెక్రటరీ కోర్ల కోట కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ప్రజల సంక్షేమంకు కట్టుబడి ఉన్నాం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కుటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పార్టీ సీనియర్ నాయకులు పాండ్రంకి శంకర్ స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని 15వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల లబ్దిదారుల కళ్లల్లో ఆనందం వ్యక్తమవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పాలిట పెన్నిధిగా కొనియాడారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలంలో ఒక పక్క అభివృద్ధి మరో పక్క సంక్షేమం యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర వైపు నడిపిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్‌లోని ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఒకటో తేదీనే ఠంచనుగా పంపిణీ, దీపం 2 పథకం కింద ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు సరఫరా, తల్లికి వందనం ద్వారా, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు తల్లుల ఖాతాలో జమ, అదే విధంగా అన్నదాత సుఖీభవ కింద రైతన్నకు ఆర్థిక సహాయం, ఆగస్టు15 నుండి మహిళల ఉచితబస్సు ప్రయాణం, ఇంకా ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ యువతకు, ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి కల్పించబోతున్నారన్నారు. కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాధ్యం అని సర్వత్రా నమ్ముతున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగాలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణ మనందరి బాధ్యత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జూలై నెలను డెంగ్యూ వ్యాధి నివారణ మాసంగా పాటించాలని, డెంగ్యూ వ్యాప్తి సీజనల్ కాబట్టి ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలాని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. కె.అనిత పేర్కొన్నారు. జూలై1 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు డెంగ్యూ నివారణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఏడు రోడ్డు జంక్షన్ వద్ద వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచడం, తాగునీటి నిల్వల వద్ద చెత్త తొలగించడం, దోమలవృద్ధి నిరోధక చర్యలు తీసుకోవడం వంటి అవగాహన కార్యక్రమాలు చేపడతారన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నెలంతా కార్యక్రమాల నిర్వాహణకు జిల్లా మలేరియా అధికారి పి.వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, డాక్టర్ వెంకటరావు, వెక్టర్ కంట్రోల్ స్పెషలిస్ట్ వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

## రక్త దాతలు... ప్రాణదాతలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ బ్లడ్‌బ్యాంకు ప్రాంగణంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు లయన్ డాక్టర్ పైడి సింధూర మాట్లాడుతూ రక్తదాతలు ప్రాణదాతలని, రక్తకొరత కారణంగా ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని, రక్తదానంతో పదిమంది ప్రాణాలు కాపాడగలమన్నారు. నగరంలో ప్రతీరోజు ఎన్నో యూనిట్లు అవసరమౌతున్నాయని, అందుకు భిన్నంగా రక్తకొరత ఉందని, సామాజిక బాధ్యతతో, మానవతా దృక్పథంతో అలోచించి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నేటి రక్తదాతలు గాయత్రీ కళాశాల విద్యార్థులకు జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందించి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నటుకుల మోహన్, కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, సభ్యులు పొడుగు చరణ్, అడప, శాంతి, బ్లడ్‌బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు, పిల్లల సంరక్షణపై అవగాహన సదస్సు

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ప్రభుత్వ జూనియర్ కళాశాల, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల సంరక్షణ అనే అంశంపై మంగళవారం అవగాహన నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి జలుమూరు రవిబాబు నేతృత్వంలో పోలీసు సిబ్బంది సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్సై జి.వాసుదేవరావు, శ్రీకాకుళం శక్తి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ పోలీసు సిబ్బంది వివిధ రకాల నేరాలు, స్వీయ రక్షణ, మెళుకువలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. యాప్ పై పూర్తి అవగాహన కలివుండాలని, అవసరాలకు అనుగుణంగా యాప్‌లో పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సమాచారం అందుకున్న పోలీసులు సకాలంలో స్పందించి సహాయపడతారన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో ఎలా స్పందించాలో డిజిటల్ ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థులతో మాక్‌డ్రిల్ చేసి చూపించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ బి.శ్యామ్ సుందర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## పింఛన్లు పంపిణీలో రవికుమార్



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి మండలంలోని మూల సవలాపురం గ్రామంలో మంగళవారం ఉదయం ఆరు గంటలకే భారీ వర్షంలో కూడా లబ్ధిదారులు ఇంటి వద్దకు ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవి కుమార్ వెళ్లి స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతీ పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడడం లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు అని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణం నుండే పింఛన్ రూ.3వేల నుంచి రూ.4వేలు చేశామన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యం, మండల పార్టీ అధ్యక్షులు అంబాల రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు, గ్రామ సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు, సురేంద్ర, పల్లి సురేష్‌లు పాల్గొన్నారు.

## హోమియో వైద్యశాల తెరిపించండి

(సత్యంన్యూస్, జలుమూరు)



మండలంలోని శ్రీముఖ లింగం గ్రామంలో గత ఆరు నెలలుగా ప్రభుత్వ హోమియో వైద్యశాల మూసి ఉండటంవల్ల రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యునైటెడ్ నేషన్స్ ఎగైనెస్ట్ కరప్షన్ నేషనల్ అంబాసిడర్ నాయుడుగారి రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. హోమియో ఆసుపత్రి తెరవకపోవడం వలన ఆ మందులతో నయమయ్యే రోగులు తరచూ ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. డాక్టర్ ఆధ్వర్యంలో నడిచే ఈ ఆసుపత్రి తెరవకుండా ఉండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే కలెక్టర్ స్పందించి ఈ ఆసుపత్రి పున:ప్రారంభించేలా చూడాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

(సత్యంన్యూస్, ఎల్.ఎన్.పేట)

మండలంలో ప్రాథమికోన్నత పాఠశాల కోవిలాంలో విద్యార్థులకు యూనిఫాం, షూస్‌ను సర్పంచ్ ప్రతినిధి నడిపిల్లి నారాయణరావు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అనేక రకాల సదుపాయాలు కల్పిస్తూ విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ పథకాలన్నీ అందిపుచ్చుకొని భవిష్యత్తును బంగారు బాటలు చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో అర్హులైన ఉపాధ్యాయులు ఉంటారని, రూ.కోట్లు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. వేల రూపాయల ఖర్చు చేసి ప్రైవేటు పాఠశాలలో చేర్పించి ఆర్థికంగా తల్లి దండ్రులు బలహీనులుగా తయారవుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కార్యదర్శి కొమరాపు చిరంజీవరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూల గజపతిరావు, ఉపాధ్యాయులు పెద్దకోట వెంకటరావు, పెద్దకోట శ్రీనివాసరావు, వెంకటలక్ష్మి, విశ్వేశ్వరరావు పాఠశాల చైర్మన్, వైస్‌చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతి వృద్ధ జనాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డాక్టర్స్ డే సందర్భంగా పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పాత శ్రీకాకుళంలోని ప్రశాంతి వృద్ధ జనాశ్రమంలో సుమారు 100మంది వృద్ధులకు బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు వండాన శిమ్మన్న, కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ డాక్టర్స్‌డే సందర్భంగా వృద్ధులకు వైద్య సేవలు అందించడం చాలా మంచి పరిణామమన్నారు. వృద్ధ జనాశ్రమం నిర్వహిస్తున్న బిఏఎల్ ప్రసాద్, సంతోష్‌లను అభినందించారు. ఆదిత్య వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పీఎంపీ వైద్యులు కోవిడ్ టైంలో ఇంటింటికి వెళ్లి అందించిన వైద్యసేవలు చాలా అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో ట్రెజరర్ కె.జనార్దన్‌రావు, జాయింట్ సెక్రెటరీ చిన్నాల రాములు, ఈసీ మెంబర్స్ అరసవిల్లి ముసలినాయుడు, గురుగుబిల్లి గిరిబాబు, కింజరాపు రాజారావు, సీనియర్ మెంబర్స్ మడ్డి అప్పలరాజు, కడుపు రామారావు, మంగరాజు లవుడు, ఆర్ తారకేశ్వరరావు, ఐ.మోహన్‌రావు, రుప్ప నవీన్, డోల వాసు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాని కళ్ళల్లో ఆనందం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతి పేదవానికి పింఛన్ సకాలంలో అందిస్తున్నామని అందుకునేటప్పుడు ఆ పేదవాడు ఆనందం హద్దులు లేవని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధి దమ్మలవీధిలో జోరు వానలో కూడా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కచ్చితంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒకటో తేదీని వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు అన్ని వర్గాల వారికి ఆసరాగా పింఛన్ల పంపిణీ ఓ జాతరలా సాగుతుందన్నారు. ఆర్థిక స్వావలంబన అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ పింఛన్ల పథకం అందరికీ సంతోషం కలిగిస్తుందని, వారి బ్రతుకుతెరువు కోసం ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. పింఛన్ అందగానే వారి ఆనందానికి హద్దులు లేవని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను గుర్తించి ఎవరికి అన్యాయం జరగకుండా అన్ని చర్యలు తీసుకొని సకాలంలో ఈ పంపిణీని పండగ వాతావరణం నిర్వహిస్తున్నామన్నారు. దమ్మల వీధిలోగల రోడ్స్ డ్రైన్స్ పరిశీలించారు. 2.40 లక్షల అంచనా విలువ గల సిమెంట్ రోడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్స్, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'పై సమీక్ష

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నేపథ్యంలో ఈనెల 3న స్థానిక సన్‌రైజ్ హోటల్ వద్ద జరగనున్న ముఖ్య సమావేశానికి సన్నాహకంగా జిల్లాలో కార్యకలాపాలు ముమ్మరమయ్యాయని వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. సమావేశ ఏర్పాట్లపై చర్చించేందుకు జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సారథ్యంలో శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయకులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ విజయవంతం కావడమే లక్ష్యంగా విభిన్న అంశాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా పార్టీ ప్రముఖులు ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, గొండు కృష్ణమూర్తి, ఆరంగిమురళి, చిట్టి జనార్ధన, ఎన్ని ధనంజయరావు, చింతు రామారావు, అంబటి శ్రీనివాసరావు, గేదెల పురుషోత్తం, రౌతు శంకరరావు, బొబ్బది ఈశ్వరరావు, పొన్నాడ రుషి, ముంజేటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అన్ని నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు.



## రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఓటర్ల జాబితా తయారీలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలతో ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కె.సాయిప్రత్యూష మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలో గల అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ప్రతినెల రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలు తగిన సహకారం అందంచాలని ఆమె కోరారు. ఎన్నికల సంఘం ప్రీ రివిజన్ యాక్టివిటీస్ షెడ్యూల్‌ను కూడా ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో ఈ ఏడాది జనవరి 6 నుంచి జూన్ 30 వరకు ఓటర్ల జాబితాలో మరణించినవారు, వివాహం జరిగి వలస వెళ్లిన ఓటర్ల తొలగింపుతో పాటు డబుల్ ఓటర్లుగా ఉన్న వారిని 532మందిని తొలగించామన్నారు. అన్ని పార్టీల వారికి బూత్ లెవెల్ ఏజెంట్స్ జాబితాను ఇవ్వాలని కోరారు. సమావేశంలో శ్రీకాకుళం తహసిల్దార్ ఎస్. గణపతిరావు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ జి.కె.శ్రీనివాసరావు, రాజకీయ పార్టీల నాయకులు మాదారపు వెంకటేష్, జనార్ధన, ఆర్.శంకరరావు, ఆర్.పురుషోత్తం, బి.అర్జునకుమార్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.




ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ: వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

# ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేకపోవడం శోచనీయం

- వైకాపా జిల్లా ఉపాధ్యక్షురాలు ఎంవీ పద్మావతి
- కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మెకు మద్దతు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దాదాపు 50 రోజులుగా మున్సిపాలిటీకి ఆయువుపట్టు లాంటి విభాగాల బాధ్యతలు మోస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మెలో ఉంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేకపోవడం శోచనీయమని వైకాపా జిల్లా ఉపాధ్యక్షురాలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి అన్నారు. కార్పొరేషన్ కార్యాలయం బయట సమ్మెలో ఉన్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది శిబిరాన్ని ఉద్దేశించి ఆమె మంగళవారం మాట్లాడారు. తాగునీటి సరఫరా, కల్వర్టుల నిర్మాణం, వీధి దీపాల నిర్వహణతో పాటు అనేక నిర్మాణ పనులకు సంబంధించి ఇంజినీరింగ్ విభాగంలో ఉన్న సిబ్బందితో పాటు కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, టాక్స్ వసూలుచేసే సిబ్బంది సమ్మెలో ఉండటం వల్ల కార్పొరేషన్‌లో పాలన స్తంభించిపోయిందని, ప్రభుత్వం దీనిపై చర్చలు జరపకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తుంటే.. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ చర్చలకు అని కూర్చుని, అవి ప్రారంభించకుండానే వెనుదిరగడం చూస్తుంటే కాంట్రాక్ట్ సిబ్బంది సేవలు అవసరం లేదన్నట్టే అర్థమవుతుందన్నారు. కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందే రెగ్యులర్ సిబ్బంది కంటే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, వర్క్‌లోడ్ కూడా వీరిపైనే ఎక్కువగా ఉందని, అటువంటి వారి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. స్థానికంగా సిబ్బంది సమ్మెలో ఉంటే వచ్చిన నష్టమేమీ లేదని సంబంధిత మున్సిపల్ కమిషనర్లు ప్రభుత్వానికి నివేదించడం వల్ల చర్చలు జరగడంలేదని, వాస్తవానికి పాలన స్తంభించిపోయిన విషయం కమిషనర్లే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ప్రత్యేకాధికారిగా కలెక్టర్ ఉన్నందున ఇక్కడి సమస్యను ఆయనకు కమిషనర్ వివరించివుండాల్సిందని, ఇప్పటికే నగరంలో ఒక్క వీధి దీపం కూడా వెలగడంలేదని, తరచూ తాగునీటి సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతున్నాయని, మరికొంత కాలం సమ్మె కొనసాగితే నగరం అస్తవ్యస్తమవుతుందని పద్మావతి ఆందోళన వ్యక్తం చేశారు. వైకాపా వీరి సమ్మెకు మద్దతిస్తుందని ఆమె ప్రకటించారు. ఈమె వెంట వైకాపా ఆర్యవైశ్య అధ్యయన కమిటీ అధ్యక్షుడు మండవిల్లి రవి, మహిళా విభాగం నాయకురాలు టి.కామేశ్వరి, మాజీకౌన్సిలర్ పిల్లల నీలాద్రి, సాధు వైకుంఠం, ఎం.ఎ. బేగ్, దండి రంగాజీదేవ్, తోట తారక్‌నాథ్, అలపాన త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో సాంకేతికతదే అగ్రస్థానం

- సీఐ ఎం.శ్రీనివాసరావు
- 'పద్మావతి'లో ఐఐటీ స్కూల్‌కనెక్ట్ ప్రోగ్రాం



(సత్యంన్యూస్, నరసన్నపేట)

భవిష్యత్తులో సాంకేతికతదే అగ్రస్థానమని, అందులోనూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ప్రోగ్రామింగ్, డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్ ముందుంటాయని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం ఐఐటి మద్రాస్‌తో ఒప్పందం కుదుర్చుకుని స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాం ద్వారా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్‌పై పట్టున్నవారు మేటి అవకాశాలు సొంతం చేసుకుంటారని, ఆ దిశగా ఆలోచించి పద్మావతి జూనియర్ కళాశాల ఐఐటి మద్రాస్‌తో స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగమవడం సంతోషం అన్నారు. డేటా సైన్స్‌కు సంబంధించి డేటాను అధ్యయనం చేయడం, డేటాను విశ్లేషించడం, ప్రోగ్రామింగ్ తదితర వినూత్నమైన అంశాలను ఈ శిక్షణ కార్యక్రమంలో పొందుపర్చారని విద్యార్థులు ఆయనకు తెలియజేశారు. విద్యార్థులు ఇంజనీరింగ్ రంగంలోకి అడుగుపెట్టే సమయంలో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పించడంతో పాటు తగిన మార్గదర్శకత్వాన్ని అందించినట్లు డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ వివరించారు. ఇంజనీరింగ్ ప్రపంచంతో విద్యార్థులు అనుసంధానం కావడానికి అవసరమైన వాస్తవిక అనుభవాలను అందించడంలో ఐఐటి మద్రాస్ ఈ కోర్సు రూపొందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు బి.రాంబాబు పాల్గొన్నారు.







# ఘనంగా 'సహకార దినోత్సవం'



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అంతర్జాతీయ సహకార దినోత్సం వారోత్సవాలను స్థానిక డీసీసీబీ ప్రధాన కార్యాలయం వద్ద ఏపీ సహకార యూనియన్ అధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, సీఈవో దత్తి సత్యనారాయణ, బ్యాంకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. శివ్వాల మాట్లాడుతూ సహకార సంఘంలో గత కొన్నేళ్లుగా బాధ్యతాయుతంగా పని చేయడంతో ఆయన్ని గుర్తించి డీసీసీబీ చైర్మన్‌గా సీఎం చంద్రబాబునాయుడు, సహకార శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు బాధ్యతలను అప్పగించారన్నారు. సహకార సంఘాలు సభ్యులకు సేవ చేసే అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి ధన్యావాదాలు తెలిపారు. రైతులకు డీసీసీబీ ద్వారా మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు. ప్రతి ఏటా మాదిరిగానే అన్ని సహకార సంఘాలలో సహకార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం డి.వరప్రసాద్, జగదీష్, డీజీఎం సత్యనారాయణ, రమేష్, ఏజీఎంలు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ ఏఎన్ఎంల కౌన్సిలింగ్ పెంటపెంట!

(మొదటిపేజీ తరువాయి)

సచివాలయానికి సంబంధించి వాగ్వాదం జరిగింది. రోస్టర్‌లో ముందున్న తనకు ఆదివారంపేటలో ఖాళీ లేదని చెప్పారని,స తన తర్వాత వచ్చిన ఆమెకు ఎలా ఈ స్థానం కేటాయించారంటూ గొడవ జరగడంతో మొత్తం వ్యవహారం బయటకు వచ్చింది. రాజకీయ నాయకుల సిఫార్సు మేరకు ఖాళీలు ఉంచామని చెప్పిన కౌన్సిలింగ్ సిబ్బంది ఆ ముసుగులో మరికొన్ని అర్బన్ ఖాళీలను దాచేశారని తేలింది. పెద్ద ఎత్తున గొడవ జరగడంతో బ్లాక్ చేసి ఉంచిన ఖాళీలను కూడా రిలీజ్ చేయాల్సి వచ్చింది. దీంతో రోస్టర్‌లో వెనుక వరుసలో ఉన్నవారు ఈ స్థానాల్లో బదిలీ పెట్టుకున్నారు. వాస్తవానికి ఇవే స్థానాలు మెరిట్‌లో మొదట ఉన్నవారికి దక్కాలి. కానీ సోమవారం ఈ సచివాలయాల్లో ఖాళీలు లేవని తేల్చేయడంతో వీరు వేరే ప్రాంతాలకు బదిలీ పెట్టుకున్నారు. అర్బన్‌లో ఉన్నవారు పక్క వార్డులకు వెళ్లగా, రూరల్‌లో ఉన్నవారు పక్క సచివాలయంతో సరిపెట్టుకున్నారు. సచివాలయాల్లో పనిచేసే మిగిలిన ఉద్యోగులకు కూడా ఇటువంటి కౌన్సిలింగ్ పద్ధతిలోనే బదిలీలు చేశారు. ఎక్కడా స్థానాలు బ్లాక్ అయ్యాయన్న ఆరోపణలు రాలేదు. ఎందుకంటే.. సచివాలయంలో ఇప్పటి వరకు పని చేస్తున్న ఉద్యోగులందరూ బదిలీకి అర్హులే. దీనికి తోడు ఇంత శాతానికి మించి బదిలీలు చేయకూడదన్న నిబంధన ప్రభుత్వం విధించలేదు. కాబట్టి అన్ని పోస్టులు ఖాళీగా చూపించి కొత్తగా వాటిని బదిలీల్లో భర్తీ చేసినట్లు ఆదేశాలివ్వాలి. ఇక్కడ కొన్ని స్థానాలు బ్లాక్ చేయడం వల్లే గందరగోళం నెలకొంది. తర్వాత మళ్లీ వాటిని ఓపెన్‌లో పెట్టడం వల్ల రోస్టర్‌లో వెనుక ఉన్నవారు అదృష్టవంతులుగా మారారు. 605 మందికి బదిలీలకు అర్హులుగా నిర్ణయిస్తే, రోస్టర్‌లో మొదటి 350 మందికి ఇప్పటి వరకు పని చేసిన మండలాలకు బదిలీలకు అవకాశం ఇస్తే.. ఇప్పటి వరకు పని చేస్తున్న మండలంలోనే పక్క సచివాలయానికి అనుమతి ఇవ్వలేదు. ఆ తర్వాత పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం కావడంతో, ఆ అవకాశం కల్పించారు.

## విద్యాసంస్థలను కలిపెయ్...

# విద్యార్థులను కర్వేపాకులా తీసిపారెయ్!

(మొదటిపేజీ తరువాయి)

అక్కడి విద్యార్థుల సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్న గ్లోబల్ యాజమాన్యం.. కళాశాల నుంచి వెళ్లిపోయిన విద్యార్థులకు రిజల్ట్స్ వచ్చిన తర్వాత ఆ సర్టిఫికెట్లు ఇస్తామంటూ ఎన్‌వోసీలు కూడా ఇచ్చింది. కానీ ఇప్పుడు వాటిని ఇవ్వడానికి ఒక్కో విద్యార్థి నుంచి రూ.50 వేలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై 11 మంది విద్యార్థులు సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గ్లోబల్ బండారం బయటకొచ్చింది.

**ఆది నుంచీ వివాదాలే..**

మొదటి నుంచీ గ్లోబల్ విద్యాసంస్థల వ్యవహారం గోల్‌మాల్‌గానే ఉంది. నగరంలో రెండుచోట్ల గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో తరగతులు నిర్వహిస్తోంది. మండలవీధిలో ఉన్న స్కూల్‌కు మొదట్లో ఎనిమిదో తరగతి వరకు మాత్రమే అనుమతి ఉండేది. గత ఏడాది మాత్రమే 8, 9, 10 తరగతుల నిర్వహణకు అనుమతి పొందింది. కాగా నగరంలో రెండుచోట్ల నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ స్కూల్‌కు కూడా అనుమతుల్లేవు. అయినా దర్జాగా తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే తనిఖీల పేరుతో హడావుడి చేసి.. ఆ తర్వాత పట్టించుకోవడంలేదు. అసలు గ్లోబల్ విద్యాసంస్థల ప్రారంభమూ వివాదాస్పదమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో రెండు దశాబ్దాలుగా పని చేస్తున్న విశాఖ పబ్లిక్ స్కూల్‌ను నడిపించడానికి ఒప్పందం కుదుర్చుకుని అనుమతులు లేకపోయినా గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్ అని బోర్డు పెట్టేసింది. విశాఖ పబ్లిక్ స్కూల్ పేరుతోనే విద్యార్థులను చేర్చుకుని తర్వాత దశలవారీగా గ్లోబల్ స్కూల్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. గ్లోబల్ స్కూల్ పేరుతో చదువులు చెప్పి విశాఖ పబ్లిక్ స్కూల్ పేరుతో సర్టిఫికెట్లు ఇవ్వడం ప్రారంభించారు. రెండేళ్లకే విశాఖ పబ్లిక్ స్కూల్‌ను నిర్వీర్యం చేసేసిన తర్వాత మండల వీధిలో ఉన్న శారదా ప్రైమరీ స్కూల్ యాజమాన్యంతో ఒప్పందం చేసుకొని ఆ భవనంలో గ్లోబల్ స్కూల్‌ను ప్రారంభించారు. అయితే ఆశించిన స్థాయిలో ఫలితాలు లేక విశాఖ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై తల్లిదండ్రులు ఒత్తిడి పెరగడంతో కళ్లు తెరిచిన యాజమాన్యం గ్లోబల్ విద్యాసంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. కాగా శారదా స్కూల్ భవనంలో పెట్టిన గోబల్ స్కూల్ పేరును ఇంటర్నేషనల్ స్కూల్‌గా బోర్డు పెట్టడంతో అనేక మంది ఆసక్తి చూపినా దానికి విద్యాశాఖ అనుమతులు లేవని తేలడంతో విశాఖ పబ్లిక్ స్కూల్‌కు క్యూ కట్టారు. ఆ తర్వాత రాజకీయ ప్రాపకంతో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు అనుమతులు తీసుకొని ప్రైమరీ స్కూల్ నడుపుతున్నారు.

**స్కూల్‌కు అనుతులు.. ఇంటర్ క్లాసులు**

మరోవైపు ఆదివారంపేటలో ఇండియన్ ప్లే స్కూల్ యాజమాన్యంతో ఒప్పందం చేసుకొని ఒకటి నుంచి పదో తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నారు. స్కూల్ నిర్వహణకు మాత్రమే అనుమతులు ఉండగా గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో బోర్డులు ఏర్పాటు చేసి ఉన్నత తరగతులు నిర్వహిస్తోంది. చక్రధర్ ఐఐటీ, నీట్ అకాడమీలను గ్లోబల్ ఐఐటీ, నీట్ అకాడమీగా పేరు మార్చి సమాంతరంగా ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఐఐటీ, నీట్ అకాడమీలో ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ కూడా నిర్వహిస్తున్నారు. ఇంటర్ పూర్తి చేసిన వారికి చక్రధర్ జూనియర్ కళాశాల పేరుతో సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. తనతో ఒప్పందాలు చేసుకున్న విశాఖ పబ్లిక్ స్కూల్, శారద ప్రైమరీ స్కూల్, ఇండియన్ ప్లే స్కూల్, చక్రధర్ విద్యా సంస్థలన్నింటినీ ఏదోవిధంగా గ్లోబల్ యాజమాన్యం ఇబ్బంది పెట్టిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఒప్పందాలను అనుగుణంగా గ్లోబల్ యాజమాన్యం నడుచుకోకపోవడంతో ఆయా సంస్థల యాజమాన్యాలతో పాటు వాటి నుంచి గ్లోబల్ విద్యాసంస్థల్లో చేరిన విద్యార్థులు కూడా ఇబ్బంది పడుతున్నారు.

# రంగుల లోకం పిలిచేవేళ..



ఈ చెరువులో కనిపిస్తున్న పసుపు దండు కప్పలే. అదేంటీ.. కప్పలు పచ్చగా గాని, ముదురు గోధుమ రంగులో గాని ఉంటాయి కదా.. అని భావిస్తే ఈ చిన్న కప్ప తెలివితేటలు తెలుసుకోండి. వర్షాకాలం కప్పలకు సంభోగ సమయం. ఈ సమయంలో కప్పలు వాటి రంగును మసక ఆకుపచ్చ నుంచి పసుపు రంగులోకి మారుస్తాయి. మగ కప్ప ఎంత ప్రకాశవంతంగా పసుపు రంగులో ఉంటే, అది ఆడకప్పకు అంత ఆకర్షణీయంగా ఉంటుందని జంతుశాస్త్రం చెబుతుంది. ఇంతకీ ఈ కప్పలు ఎక్కడ కనిపించాయో చెప్పలేదు కదూ.. లావేరు మండలం తామాడ గ్రామంలోని బొందు చెరువులో పసుపు రంగు కప్పలు కనిపించాయి. ఇలాంటి కప్పలను గతంలో ఎప్పుడూ చూడకపోవడంతో స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

**- సత్యంన్యూస్, లావేరు**

# సమాజంలో వైద్యుని పాత్ర చాలా గొప్పది



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమాజంలో వైద్యునిపాత్ర చాలా గొప్పదని జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డాక్టర్ జామి భీమశంకర్ మంగళవారం అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా స్థానిక సింధూర వైద్యశాలలో నగరంలో ప్రముఖ వైద్యులను, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో ప్రముఖ వైద్యులు పీవీ కామేశ్వర రావు, మాలతి, సింధూర, మురళి, వినోద్‌కుమార్, సిహెచ్ కృష్ణమోహన్, రవి కుమార్, సీనియర్ నర్సులు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బి.వరలక్ష్మి, ఆర్.శ్రీనివాస్, తమ్మినేని ఉషారాణి, అనురాధ, కోరాడ రమేష్, బుడుమూరు సూర్యారావు, పద్మభూషణ్ సాయి, నారాయణ, మోహిత్, రోహిత్, కృష్ణకాంత్, మాధవి, స్వాతి, శ్యామల హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I **KANCHARAPU HARITHAMMA** D/o **KANACARAPU JANARDHANARAO** previously called **KANCHARAPU HARITHA**, presently residing at chodavaram village, Narasannapeta Mandal, Srikakulam District, Now changed my name from **KANCHARAPU HARITHA** (old name) to **KANCHARAPU HARITHAMMA** (new name) hence forth be known as **KANCHARAPU HARITHAMMA** for all purposes.

**CHANGE OF NAME**

I **SAILADA MANGAMMA** D/o **SAILADA NARAYANA RAO** previously called **SAILADA MANGA**, presently residing at chodavaram village, Narasannapeta Mandal, Srikakulam District, Now changed my name from **SAILADA MANGA** (old name) to **SAILADA MANGAMMA** (new name) hence forth be known as **SAILADA MANGAMMA** for all purposes.

# కళ్యాణ తిరుమలకు ఆరికతోట విరాళం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కలెక్టర్ బంగ్లా దరి కళ్యాణ తిరుమల దేవస్థానానికి ప్రొఫెసర్ ఆరికతోట కనకరాజు, ఉమ దంపతులు విరాళం అందించారు. కనకరాజు తన 80వ పుట్టినరోజు సందర్భంగా కళ్యాణ మండపం నిర్మాణం నిమిత్తం రూ.10వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బెహరా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.